సాక్షి మంచిర్యాల

ఆదివారం । 7 । జూలై । 2024


రవీందర్


సత్యం

ఏజీపీలుగా రవీందర్, సత్యం

చెన్నూర్/లక్సెట్టిపేట: చెన్నూర్ సివిల్ కోర్టు న్యాయవాది కొలిపాక రవీందర్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా, లక్సెట్టిపేట జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాది వేల్పుల సత్యం ఏజీపీగా నియామకం అయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.



టీజీఎఫ్ సెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం టీజీఎఫ్ సెట్-2024 కౌన్సెలింగ్‌కు 464 మంది విద్యార్థులు హాజరయ్యారు. ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసినట్లు ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0 /26.0

మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రివేళ అక్కడక్కడ వర్షం కురుస్తుంది. దక్షిణ నైరుతి దిశగా గాలులు బలంగా వీస్తాయి.

అసౌకర్యాల వసతి

సాక్షి విజిట్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఎస్సీ వసతిగృహాలు 23 ఉన్నాయి. ప్రీ మెట్రిక్ 17(బాలురు, బాలికలు), పోస్టుమెట్రిక్ 8 ఉండగా 2,500 మంది వసతి పొందే అవకాశం ఉంది. ఇందులో కొన్ని వసతిగృహాలు విద్యార్థులు లేక మూసివేత దిశగా ఉన్నాయి. వసతితో విద్యనందించే కేజీబీవీ, రెసిడెన్షియల్, మోడల్‌స్కూళ్లకు విద్యార్థులు వెళ్లడంతోనే వసతిగృహాల్లో చేరేందుకు అనాసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పొన్నారం, తపాలపూర్‌లో విద్యార్థులు లేరు. దండేపల్లి, చింతగూడ, ఐబీ తాండూర్, చెన్నూర్ గర్ల్స్, చెన్నూర్ బాయ్స్, మందమర్రి ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లో 40లోపు విద్యార్థుల ఉన్నారు. పోస్టుమెట్రిక్(కళాశాల)లో విద్యార్థికి రోజు రూ.50 చొప్పున రూ.1500, ప్రీమెట్రిక్‌లో ప్రీ ప్రైమరీ(3నుంచి 7వ తరగతి వరకు) విద్యార్థికి రూ.950, హైస్కూల్ విద్యార్థులకు(8నుంచి 10వ తరగతి) రూ.1100 వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 2015 నుంచి సన్న బియ్యంతోపాటు పోషకాహారం అందిస్తున్నారు. జిల్లాలో బీసీ ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు 15 ఉన్నాయి. ఇందులో ప్రీ మెట్రిక్ హాస్టళ్లు 8 ఉండగా 985 మంది విద్యార్థులు వసతి పొందుతూ పాఠశాలలో చదువుతున్నారు. పోస్టుమెట్రిక్ 7 వసతిగృహాలు ఉండగా ఒక్కో చోట వంద చొప్పున విద్యార్థులు వసతి పొందుతూ కళాశాలలో చదువుతున్నారు. ప్రీమెట్రిక్-మందమర్రి(గర్ల్స్,) దండేపల్లి, పోస్టుమెట్రిక్ చెన్నూర్, మంచిర్యాల బాలుర, బాలికలు హాస్టళ్లు అవస్థల మధ్య అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పక్కా భవనాలు నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.


బీసీ సమీకృత వసతిగృహంలో స్నానంగది ఇదీ..


మూలనపడిన ఆర్వోప్లాంటు


అద్దెభవన వసతిగృహంలో ఇరుకైన బాత్రూంలు

- అద్దె భవనాల్లో సమస్యలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లలకు ఊతంగా ఉన్న వసతిగృహాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. ఇరుకుగదులు, నీటి సమస్య, శిథిల భవనాలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సిబ్బంది కొరత వేధిస్తోంది. శనివారం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను 'సాక్షి' విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగుచూశాయి. మంచిర్యాలలోని ప్రభుత్వ బీసీ సమీకృత బాలుర వసతిగృహం, బీసీ వెనుకబడిన తరగతుల


పాకురు మధ్యన చేతులు కడుక్కుంటున్న విద్యార్థులు

బాలుర కళాశాల వసతి గృహాల్లో 400మందికి గాను ప్రస్తుతం 120 మంది మాత్రమే ఇక్కడ ఉంటూ సమీప పాఠశాలలో చదువుతున్నారు. మూడు హాస్టళ్లలో ముగ్గురు కుక్‌లు, ముగ్గురు వాచ్‌మెన్‌లు, ముగ్గురు కామాటిలు ఉండాల్సి ఉండగా.. ఒక్కొక్కరు మాత్రమే పని చేస్తున్నారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కరే కుక్ కావడం.. శనివారం సమయం లేకనో ఏమో గానీ రాగిజావా కారిపోయింది. విద్యార్థులు అల్పాహారం(పులిహోర)తో సరిపెట్టుకున్నారు. మరుగుదొడ్లకు నీటి సరఫరా నిలిచి, కుళాయిలు విరిగి కంపుకొడుతున్నాయి. తాగునీటిని సరఫరా చేసే ఆర్వో ప్లాంటు మూలన పడింది. నీటి కుళాయిల వద్ద పాకురు పట్టి ఉన్న చోట విద్యార్థులు చేతులు కడుక్కోవడంతో అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.

అద్దెభవనం

ప్రభుత్వ వెనుకబడి తరగతుల బాలుర కళాశాల వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. వందమంది విద్యార్థులు ఉన్న చోట గదులు తక్కువగా ఉండడం, మరుగుదొడ్లు, స్నానగదులు సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాలకృత్యాలు తీర్చుకుని, స్నానాలు ఆచరించే సరికి సమయం గడిచిపోతోంది. ఒక్కోసారి అల్పాహారం తినకుండానే వెళ్తున్నారు. వసతిగృహం దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో కళాశాలకు వచ్చి వెళ్లాలంటే మధ్యాహ్నం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో ఉదయం వండిన అన్నం బాక్సులో తీసుకెళ్లి మధ్యాహ్నం తినడం మినహా చేసేదేమీ లేదు. కళాశాలకు దగ్గరగా వసతిగృహం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

తగ్గిన విద్యార్థుల సంఖ్య


నిర్వహణ లేక అధ్వానంగా మరుగుదొడ్లు

తాండూర్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో సమస్యల కారణంగా విద్యార్థుల సంఖ్య పడిపోయింది. గతంలో దాదాపు 80 నుంచి 100 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 11మందికే పరిమితమైంది. హాస్టల్‌కు ఓ వైపు ప్రహరీ లేక పందుల సంచారం ఎక్కువైంది. నిర్వహణ లేక మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాటర్ ట్యాంకు సమీపంలో మురికి నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. హాస్టల్ వరండాలో, గదుల్లో పైకప్పు పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారాయి. రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో సమస్యల పరిష్కారంపై చొరవ చూపే వారే లేకుండా పోయారు.

పని చేయని ఆర్వో ప్లాంటు


మరమ్మతుకు నోచని సోలార్ వాటర్ హీటర్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలుర హాస్టళ్లను 'సాక్షి' విజిట్ చేసింది. ఎస్సీ బాలుర హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఆర్వోప్లాంటు మరమ్మతుకు నోచుకోకపోవడంతో శుద్ధ జలం లేక బోరు నీటిని తాగాల్సి వస్తోంది. స్నానాల కోసం ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్ ఆరు నెలల క్రితం చెడిపోయింది. ఇప్పటికీ మరమ్మతు చేయించలేదు. దీంతో విద్యార్థులు ఉదయం చన్నీటి స్నానం చేస్తున్నారు. గదుల కిటికీలు ఊడిపోయాయి. రాత్రి సమయంలో ఈదురుగాలులు వస్తుండడంతో అట్టముక్కలు అడ్డుపెట్టారు. వర్షాకాలంలో కిటికీల నుంచి వర్షపు జల్లులు పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ ఆవరణలో నీరు నిలిచి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. ఆరు మరుగుదొడ్లకు రెండు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో ఏర్పాటు చేశారు.


చెన్నూర్‌లో పని చేయని ఆర్వో ప్లాంట్

పెచ్చులూడి పడుతున్నాయ్..

దండేపల్లి: మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ బాలుర వసతిగృహాలు ఉన్నాయి. ఎస్సీ బాలుర వసతి గృహం భవనాన్ని 34 ఏళ్ల క్రితం నిర్మించడంతో శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్ పాడైపోయింది. విద్యార్థులు బోరు నీటినే తాగుతున్నారు. ఈ విద్యాసంవత్సరం హాస్టల్‌లో సుమారు 30మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ బాలుర వసతిగృహం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు.


ఎస్సీ హాస్టల్‌లో పెచ్చులూడిన పైకప్పు

పాతభవనం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ భవనం పాతబడిపోయింది. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నా భవనం పాతబడిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు పాతబడిపోవడంతో పలుమార్లు మరమ్మతులు చేయించారు. డైనింగ్ హాల్ లేకపోవడం, రేకుల షెడ్డు భవనం కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.


ఎస్సీ వసతి గృహంలో పాతబడిన టాయిలెట్‌లు

శిథిలావస్థ.. ఇరుకు గదులు

కోటపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. హాస్టల్‌లో సుమారు 120 మంది విద్యార్థులకు గాను ఐదు గదులు మాత్రమే ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపోక.. ఇరుకు గదుల్లో సామగ్రితో అందులోనే పడుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ చదువులు సాగిస్తున్నారు.


పడుకునే గదిలోనే భోజనం చేస్తున్న విద్యార్థులు

మరుగుదొడ్లతో దుర్గంధం

భీమారం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీకృత బాలుర వసతిగృహంలో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతంలో బీసీ, ఎస్సీ వసతిగృహాలు వేర్వేరుగా ఉండేవి. ప్రభుత్వం రెండు హాస్టళ్లను కలిపి సమీకృత వసతిగృహంగా మార్చింది. ఇందులో 75మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లు జామ్ కావడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ప్రత్యేకంగా మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. కానీ అది పనిచేయకపోవడంతో బోరు నుంచి వచ్చే నీటిని తాగుతున్నారు.


ఎస్సీ సమీకృత వసతిగృహంలో మరుగుదొడ్లు

భయం భయంగా..

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో 78 మంది విద్యార్థులు, బీసీ బాలికల వసతి గృహంలో 70 మంది విద్యార్థినులు ఉన్నారు. ఎస్సీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. కొత్త భవనం నిర్మించాల్సి ఉండగా.. రెండేళ్ల క్రితం మరమ్మతు చేసి స్లాబ్ పగుల గొట్టి ఒక పక్కన రేకులు వేశారు. గోడలు, పిల్లర్లు వంగిపోవడం, రేకుల నుంచి వర్షం నీరు ఉరుస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు భవనం కూలుతుందోనని భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలం అయ్యాయి.


రేకులు వేసిన వసతిగృహం లోపలి భాగం

బోర్ వాటరే దిక్కు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని నాలుగు హాస్టళ్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. సుమారు మూడేళ్లుగా ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదని సమాచారం. ఎస్సీ కాలేజీ గర్ల్స్ వెల్ఫేర్ హాస్టల్, బీసీ గర్ల్స్ వెల్ఫేర్ హాస్టల్, ఎస్సీ బాలుర, ఎస్సీ కాలేజీ గర్ల్స్ హాస్టల్ ఉన్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో బోర్ నీటినే వినియోగించాల్సి వస్తోంది. నీరు ఉప్పుగా ఉండడంతో తాగలేకపోతున్నారు. కొన్నిచోట్ల ఆర్వోప్లాంటు ఏర్పాటు చేసినా పని చేయడం లేదని తెలిసింది.

న్యూస్‌రీల్

నెన్నెల విద్యుత్ ఏఏఈపై వేటు

నెన్నెల: నెన్నెల విద్యుత్ శాఖ ఏఏఈ మిట్టపల్లి మల్లయ్యను సస్పెండ్ చేస్తూ మంచిర్యాల ఎస్ఈ శ్రావణ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనపై సమగ్ర విచారణ జరిపిన అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు డబ్బులు వసూలు చేశారని, డీడీలు కట్టినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని బాధిత రైతులు సీఎండీకి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇచ్చినప్పటికీ పనులు చేయకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకున్నాడని ఆరోపించారు. సీఎండీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు గొల్లపల్లి గ్రామంలో విచారణ చేపట్టారు. ఆధారాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించడంతో ఏఏఈపై వేటు పడింది. భీమిని ఏఏఈ బాపునకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి ఈ.శంకర్ అన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మంచిర్యాలలోని ప్రాథమిక పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ పశుపోషకులు, ఇతర జంతువుల యజమానులు పరిశుభ్రత పాటించాలని, పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జిల్లాలోని 44 పశువైద్యశాలల్లో రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పశువైద్యులు జి.శంకర్‌లింగం, సహాయ పశువైద్యులు ఎస్.రవళి, జి.వర్షిణి, సిబ్బంది రమేష్, లక్ష్మి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


బాలింతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- మాతా శిశు ఆరోగ్య కేంద్రం పరిశీలన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాతాశిశు ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎలక్ట్రీషియన్లు, ఏసీ టెక్నీషియన్లు, స్కానింగ్ ఆపరేటర్లు, సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, విధుల్లో నుంచి తొలగిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆయన మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రతీ గదికి వెళ్లి సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఐసీలు 12పడకలు ఉన్నా ఒకే ఏసీ ఉండడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మరో రెండు ఏసీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ వార్డులో ఏసీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఇష్టారీతిన నిర్మించి సౌకర్యాలపై పట్టించుకోలేదని, కమీషన్ల కోసం ఎలా నిర్మించినా అనుమతి ఇచ్చారని ఆరోపించారు. విద్యుత్ సమస్యపై నిర్లక్ష్యం వహించిన ఎలక్ట్రీషియన్లు, ఏసీ టెక్నీషియన్లను ఈ రోజు నుంచే విధుల్లో నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. వరండాల్లో ఫ్యాన్లు, వార్డుల్లో ఏసీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్కానింగ్ ఆపరేటర్లు ప్రైవేటు చేసుకుని ఆలస్యంగా వస్తున్నారని, ఉదయం 8.30గంటలకే రాకుంటే వారినీ విధుల నుంచి తొలగిస్తామని అన్నారు. సాంకేతిక సమస్యల పేరిట స్కానింగ్, ఎక్స్‌రే తీయకుండా తప్పించుకుంటున్నారని, అలాంటి వారు తీరు మార్చుకోవాలని మెచ్చరించారు. నూతనంగా మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఐబీ ఆవరణలో నిర్మాణానికి వారంలోపు జీవో వచ్చే అవకాశం ఉందని, దసరాలోపు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, ఎంసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, గైనకాలజిస్టు డాక్టర్ అలివేణి పాల్గొన్నారు.

ఏ కాలమైనా నీటి ఎద్దడి తలెత్తదు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు ఏ కాలమైనా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మిషన్ భగీరథ, మంచిర్యాల మున్సిపాలిటీ ఇంటెక్ వెల్స్, ప్రాజెక్ట్ పరిసరాలు, ప్రాజెక్ట్‌లోని నీటి మట్టం వివరాలపై ఆయన ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ప్రజలకు ఉన్న మంచినీటి సమస్యలు ఈ ఏడాది దాదాపు పూర్తిస్థాయిలో పరిష్కారం కాగా భవిష్యత్‌లో సమస్యలు ఉండబోవని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, కౌన్సిలర్ పూదరి ప్రభాకర్, తాజా మాజీ ఎంపీటీసీలు బాలరాజ్, బాపు పాల్గొన్నారు.

సింగరేణి భూములిస్తేనే అభివృద్ధి సాధ్యం

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్
- క్యాతనపల్లి మున్సిపాలిటీలో అధికారులతో సమీక్ష

రామకృష్ణాపూర్: సింగరేణి భూములు ఇస్తేనే క్యాతనపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలవుతుందని చెనూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమెల్యే మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీరందించాలని ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతులు ఎక్కడెక్కడ అవసరమో గుర్తించాలని సూచించారు. గద్దెరాగిడి ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవుల కోసం శ్మశాన వాటికల నిర్మాణానికి 25 ఎకరాల సింగరేణి స్థలాన్ని ఇప్పటికే యాజమాన్యాన్ని అడిగామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ మురళీకృష్ణ, ఏఈ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వివేక్

ఆరుగురు సీఐలు, 14మంది ఎస్సైలు బదిలీ

మంచిర్యాలక్రైం: పార్లమెంటు ఎన్నికల అనంతరం పోలీసు శాఖలో భారీగా బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే డీసీపీతోపాటు పలువురు సీఐలు బదిలీ అయ్యారు. శనివారం మల్టీజోన్-1 ఇన్‌చార్జి ఐజీ సుధీర్‌బాబు మల్టీజోన్-1 పరిధిలోని ఆరుగురు సీఐలు, రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని 14మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐలు..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బీ.సత్యనారాయణ	మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయం	ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, మంచిర్యాల
కే.నరేష్‌కుమార్	ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, మంచిర్యాల	మహిళా పోలీస్‌స్టేషన్, మంచిర్యాల
కే. జగదీష్	సీసీఎస్ కుమురంభీమ్	సీఎస్‌బీ రామగుండం
ఎం.రాజ్‌కుమార్	మానకొండూర్, కరీంనగర్	టాస్క్‌ఫోర్స్ రామగుండం, మంచిర్యాల
జీ.సదన్‌కుమార్	మల్టీ జోన్-1 ఐజీ కార్యాలయం	మానకొండూర్ కరీంనగర్
ఎం.సంజయ్	టాస్క్‌ఫోర్స్ మంచిర్యాల	వీఆర్ రామగుండం
ఎస్సైలు వీరే..		
ఈ.సురేష్	బెల్లంపెల్లి-1టౌన్	మంచిర్యాల-1
బీ. వినిత	వీఆర్ రామగుండం	మంచిర్యాల-2
సీహెచ్.సనత్‌కుమార్	గోదావరిఖని-2 టౌన్	మంచిర్యాల-3
కే.మహేందర్	మంచిర్యాల-1	రామకృష్ణాపూర్
పీ.సుబ్బారావ్	మంచిర్యాల-2	చెన్నూర్-2
ఎం.ప్రశాంత్	మంచిర్యాల-3	బెల్లంపెల్లి-1టౌన్
ఎన్.సుగుణాకర్	గోదావరిఖని-1టౌన్	సీసీసీ నస్పూర్
ఎం.రవికుమార్	సీసీసీ నస్పూర్	వీఆర్ రామగుండం
జీ.ఉదయ్‌కిరణ్	వీఆర్ రామగుండం	దండేపల్లి
ఎస్.స్వరూప్‌రాజ్	దండేపల్లి	వీఆర్ రామగుండం
పి.సతీష్	సీసీఎస్ మంచిర్యాల	లక్సెట్టిపేట
పీ.చంద్రకుమార్	లక్సెట్టిపేట	వీఆర్ రామగుండం
కే.వెంకటేశ్వర్‌రావు	చెన్నూర్-2	వీఆర్ రామగుండం
కే.రామకృష్ణ	డీఎస్‌బీ, కుమురంభీమ్	వీఆర్ రామగుండం

సార్ బదిలీ.. అదే బడికి విద్యార్థులు

లక్సెట్టిపేట: సార్ బదిలీపై వెళ్తే ఆయన వెంటే విద్యార్థులూ పాఠశాల మారారు. 89మంది విద్యార్థులు బడి మారి అభిమానాన్ని చాటుకున్నారు. లక్సెట్టిపేట మండల కేంద్రంలోని క్లబ్‌రోడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.దిలీప్ బదిలీపై ముల్కల్లగూడ ప్రాథమిక పాఠశాలకు వెళ్లాడు. దీంతో ఆ పాఠశాలలో చదివిన 89 మంది విద్యార్థులూ శనివారం ముల్లల్లగూడ ప్రాథమిక పాఠశాలలో చేరారు. దిలీప్ క్లబ్ రోడ్ పాఠశాలలో పదమూడు సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అప్పట్లో 11 మంది విద్యార్థులు ఉండగా ఇళ్లకు వెళ్లి తీసుకొచ్చి చేర్పించాడు. దూరంగా ఉన్న విద్యార్థుల కోసం ఆటో ఏర్పాటు చేశాడు. ఆటపాటలతో విద్య నేర్పించడం, పిల్లలతో కలివిడిగా ఉంటూ చదువు చెప్పడంతో ఆయనపై అభిమానం పెరిగింది. దీంతో విద్యార్థుల సంఖ్య 138మందికి చేరింది. దిలీప్ చేరిన ముల్లల్లగూడ బడిలో విద్యార్థులు మూకుమ్మడిగా చేరారు. టీచర్‌ను పలువురు అభినందించారు.


పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

108లో మహిళ ప్రసవం


చిన్నారిని చూపిస్తున్న సిబ్బంది

కోటపల్లి: వేమనపల్లి మండలంలోని రాచర్ల గ్రామానికి చెందిన మంథని పుష్పకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా కోటపల్లి మండలంలోని మల్లంపేట సమీపంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ షబాజ్, పైలట్ సతీశ్ చికిత్స అందించగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యంకోసం చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తాత్కాలిక రోడ్డుతో ఇబ్బందులు


బురదలో దిగబడిన ఎరువుల లారీ

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట, పార్పల్లి గ్రామాల మధ్య లోత్‌వాగు వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతుండగా వాహనాలు వెళ్లేందుకు మట్టితో తాత్కాలిక రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బురదగా మారింది. శనివారం ఎరువుల లోడుతో వెళ్తున్న లారీ బురదలో దిగబడి పోవడంతో అటుగా వచ్చిపోయే 12 గ్రామాల ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. అత్యవసర నిమిత్తం అటుగా వెళ్తున్న అంబులెన్స్ కూడా బురదలో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని 12 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన


నిరసన తెలుపుతున్న సిబ్బంది

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు చెల్లించాలని శనివారం నిరసన చేపట్టారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో పస్తులతో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

టిప్పర్ ఢీకొని లేగదూడకు గాయాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లేగదూడకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై సంచరిస్తున్న లేగదూడను టిప్పర్ ఢీకొనడంతో రెండుకాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గమనించిన స్థానికులు పశువైద్యునికి సమాచారం అందించారు. ఇదిలా ఉంటే రోడ్డుపై పశువులు రాత్రింబవళ్లు సంచరిస్తూ రోడ్డుకు అడ్డంగా ఉంటున్నా యి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పశువుల యజమానులు వాటిని ఇళ్లకు తీసుకెళ్లేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఐటీఐ..సత్వర ఉపాధి..!


మంచిర్యాలలోని ఐటీఐ కళాశాల

- మొదటి దఫాలో 124 సీట్లు భర్తీ
- రెండో దఫా అడ్మిషన్లకు నోటిఫికేషన్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 15 తుదిగడువు
- ఏటీసీ భవనాలు పూర్తయితే ఆరు కొత్త కోర్సులు

మంచిర్యాలఅర్బన్: పారిశ్రామిక శిక్షణ నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు తలుపుతడున్నాయి. తక్కువ సమయంలో కొలువులు సాధించి స్థిరపడాలనుకునే యువతకు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) చక్కని అవకాశం కల్పిస్తోంది. మరోవైపు ప్రభుత్వం ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఐటీఐల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలకు కార్యాచరణ రూపొందించింది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. భవన నిర్మాణ పనులు పూర్తయితే ఈ ఏడాది నుంచి ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

కోర్సులకు ఆదరణ..

ఐటీఐ కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి ఈ ఏడాది మే 16 నుంచి జూన్ 14 వరకు తొలి విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కళాశాలలో మొత్తం 312 సీట్లకుగానూ 124 సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో ఎలక్ట్రీషియన్-27 సీట్లు, ఫిట్టర్-17, టర్నర్-08, ఎలక్ట్రానిక్ మెకానిక్-09, మెకానిక్-03, వెల్డర్-18, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా)-11, సోలార్ టెక్నీషియన్-19, ఫ్యాషన్ డిజైనింగ్ టెక్నాలజీ కోర్సుల్లో-12 సీట్లు భర్తీ చేశారు. ఇందులో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఫ్యాషన్ డిజైనింగ్, సోలార్ టెక్నీషియన్ కోర్సులకు డిమాండ్ అధికంగా ఉంది.

మిగులు సీట్లు

మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో మొత్తం 312 సీట్లకు గానూ మొదటిదఫాలో 124 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన 188 సీట్ల భర్తీకిగానూ రెండో దఫాలో ఈ నెల 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

రెండో విడత నోటిఫికేషన్

పారిశ్రామిక శిక్షణ సంస్థలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఉపాధి శిక్షణ శాఖ రెండోదఫా నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15లోగా ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు వెబ్‌ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు 1, 2024 నాటికి 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థులు మాత్రమే ఈ కోర్సులు అభ్యసించేందుకు అర్హులు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, టర్నర్, మిషనిస్టు, కోపా తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్నా సీటు రానివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదని, కొత్తగా వెబ్‌ఆప్షన్ మాత్రమే ఇచ్చుకోవాల్సి ఉంటుందని మంచిర్యాల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. మెరిట్, రిజర్వేషన్, అభ్యర్థి ఎంచుకున్న కోర్సును బట్టి సీట్ల కేటాయిస్తారన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు htpp//. telangana. gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏటీసీతో ఆరు కొత్త కోర్సులు

ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తూ అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుతో మరిన్ని కొత్త కోర్సులు రానున్నాయి. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఏటీసీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. దాదాపు రూ.5కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తున్నారు. కొత్త కోర్సులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. అడ్వాన్స్ సీఎన్‌సీ మెకానిక్ టెక్నీషియన్-48, ఆర్టిషియన్ యూజింగ్ అడ్వాన్స్, టూల్-20, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్-48, ఇండస్ట్రియల్ రొబొటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్-40, మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్-40, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్-48 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది నుంచి కోర్సులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

బుయ్యారంలో భూ వివాదం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు

వేమనపల్లి: బుయ్యారంలో నెలకొన్న భూ వివాదంలో అన్నదమ్ముళ్ల మధ్య గొడవ తారాస్థాయికి చేరింది. ఇరువర్గాలకు జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా దాడికి పాల్పడిన ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. జిల్లెడ గ్రామ శివారులోని సర్వే నం.94లో బైరి వెంకాగౌడ్ కుటుంబానికి పదెకరాల పట్టా భూమి ఉంది. అతని కుమారుడు లస్మాగౌడ్ పేరు మీద కొంత భూమి గతంలో విరాసత్ పట్టా అయింది. లస్మాగౌడ్ కుమారులైన వెంకాగౌడ్, తిరుపతిగౌడ్‌లకు వారసత్వంగా భూమి దక్కాల్సింది. కానీ ఈ భూమిలో నుంచి వెంకాగౌడ్ ఐదెకరాలు పట్టా చేయించుకున్నాడు. ఈ భూమిలో వారసత్వంగా తనకు వాటా ఉందని తిరుపతిగౌడ్ అడ్డుతగులుతూనే ఉన్నాడు. వారం రోజులుగా ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతోంది. శనివారం ఇరువర్గాలు ట్రాక్టర్లతో భూమి వద్దకు వెళ్లి దున్నేందుకు ప్రయత్నించగా తిరుపతిగౌడ్, అతని భార్య రేణుక, కొడుకు శ్రావణ్‌కుమార్‌లు వెంకాగౌడ్, అతని కొడుకు మణిదీప్‌లపై కర్రలతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంకాగౌడ్ ఫిర్యాదు మేరకు తిరుపతిగౌడ్, రేణుక, శ్రావణ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


ఆస్పత్రిలో వెంకాగౌడ్

14న బీఎంఎస్ మహాసభ


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: ఈ నెల 14న బీఎంఎస్ 28వ ద్వైవార్షిక మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శనివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించనున్న సభకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్‌గురుడే, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా బీఎంఎస్ నిర్మాణం, కార్మికుల హక్కులు, సదుపాయాలపై చర్చిస్తామన్నారు. సింగరేణి కార్మికులకు కోలిండియాలో ఇస్తున్నట్లు పెర్క్స్‌పై ఆదాయపన్నును రాష్ట్ర ప్రభుత్వమే రీయింబర్స్‌మెంట్ చేయాలని, బెల్లంపల్లి, రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం ఏరియాల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలని, కార్మికుల పిల్లల కోసం కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, గూడ శ్రీకాంత్, దొంతుల రాజేంద్రప్రసాద్, సతీశ్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


మారుతి మృతదేహం

కెరమెరి: మండలంలోని పెద్ద కరంజీవాడలో శనివారం పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. బేల మండలంలోని దుబ్బగూడెంకు చెందిన కొడప మారుతి (32) కెరమెరి మండలం లోని పెద్ద కరంజీవాడకు చెందిన రాథోడ్ టికరం వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. ఇటీవల కుటుంబంలో గొడవలు తలెత్తడంతో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య మీరాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గజ్జిగూడకు చెందిన చిలుకూరు లక్ష్మి (21) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబ కలహాలతో ఈ నెల 1న తల్లీకూతుళ్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఈనెల 3న తల్లి అనిత (45), కూతురు రమ్య (16) మృతి చెందిన విషయం తెలిసిందే. మెరుగైన చికిత్స నిమిత్త లక్ష్మి, ఐశ్వర్యలను మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా లక్ష్మి (21) శనివారం మృతి చెందినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు తెలిపారు.


లక్ష్మి (ఫైల్)

అప్రమత్తంగా ఉండాలి

కాగజ్‌నగర్‌రూరల్: పెద్దపులి సంచరిస్తున్నందువల్ల పట్టణ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ ఎఫ్‌ఆర్‌వో రమాదేవి సూచించారు. పట్టణ సమీప గ్రామాలైన అంకుసాపూర్, నందిగూడ, నార్లాపూర్, గోంది, దరిగాం, చారిగాం, కోసిని, రేగులగూడ, ఊట్‌పల్లి, వేంపల్లి గ్రామాల ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదన్నారు. పులి కదలికలు, పాదముద్రలులాంటి ఏమైనా ఆధారాలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బొలెరో బోల్తా..

- ఐదుగురు విద్యార్థినులకు తీవ్ర గాయాలు

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గుట్ట ఎక్కుతున్న క్రమంలో శనివారం బొలెరో వాహనం బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు మడె సునీత, మడె కాజల్, దుర్గం పావని, గౌరారం శంకరమ్మ, కొండ శ్రావణికి తీవ్రగాయాలయ్యాయి. జిల్లెడ గ్రామానికి చెందిన గౌరారం రామన్న బెజ్జూర్ నుంచి బొలెరో వాహనంలో ఎరువుల బస్తాలు, సిలిండర్లు, సిమెంట్ రేకులు, నిత్యావసర సరుకులతోపాటు బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు, తల్లిదండ్రులను ఎక్కించుకుని గ్రామానికి బయలుదేరాడు. వాహనం మురళీగూడ గుట్ట ఎక్కుతున్న క్రమంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన విద్యార్థిని

అందుబాటులో లేని 108...

ప్రమాద సంఘటన ప్రాంతంలో సిగ్నల్స్ లేక పోవడంతో జిల్లెడ గ్రామానికి చెందిన పలువురు యువకులు 108 అంబులెన్సు కోసం ఫోన్ చేయగా మహారాష్ట్ర అంబులెన్సు వారికి సమాచారం చేరింది. అత్యవసర సమయంలో మండలంలో 108 అందుబాటులో లేక పోవడంతో ప్రైవేటు వాహనంలోనే గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

ఆస్నాద భూముల పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాదలో పది రోజులుగా పట్టా భూముల విషయంలో నెలకొన్న వివాదాన్ని రైతులు శుక్రవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం అటవీశాఖ అధికారులు డీఎఫ్‌వో శివ ఆశిష్ సింగ్, ఎఫ్‌డీవో రమేశ్, ఎఫ్‌ఆర్‌వో శివకుమార్ గ్రామానికి వెళ్లి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు వివరించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపినట్లు రైతులు తెలిపారు.

మాఫియా మంచిర్యాలగా మారుస్తున్నారు..

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


మాట్లాడుతున్న నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అనుచరులు, బంధువులు మంచిర్యాలను మాఫియా మంచిర్యాలగా మారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత ఐదేళ్లలోపు వందల కోట్లు సంపాదించుకునే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పెట్టుకున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేవలం అభివృద్ధిని మాత్రమే ప్రజలకు వివరించానని, ఎవర్నీ విమర్శించలేదన్నారు. ప్రజలంతా ఏకమై ఎమ్మెల్యే చేస్తున్న అన్యాయాలను అడ్డుకోవాలని, అన్యాయం జరిగిన వారికి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ యెర్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

- 50.10 శాతం ఉత్తీర్ణత


ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈఏడాది ఏప్రిల్, మేలో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీవొకేషనల్ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శనివారం సాయంత్రం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి విడుదల చేశారు. పరీక్షలకు 46,130 మంది విద్యార్థులు హాజరుకాగా 23,114 మంది (50.10)శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలురు 22,355 మంది హాజరుకాగా 8,465 మంది (37.87శాతం), బాలికలు 23,784 మంది హాజరుకాగా 14,649 మంది (61.59శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు

కేయూ పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ల పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 18,881 మంది విద్యార్థులకుగానూ 9,657 మంది (51.15) ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11,809 మంది విద్యార్థులకుగానూ 6,352 మంది (53.79శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15,449 మంది విద్యార్థులకు గానూ 7,105 మంది (45.99శాతం) ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 7నుంచి 22వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్పాలన్నీ విషపూరితమైనవి కావు


వివరిస్తున్న స్నేక్ సొసైటీ సభ్యుడు

కాసిపేట: అన్ని సర్పాలు విషపూరితమైనవి కావని ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో అటవీశాఖ అధికారులు, స్నేక్ సొసైటీ సభ్యులతో కలిసి వివిధ రకాల విషపూరిత, విషపూరితం కాని సర్పాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పాలు అంతరిస్తే రైతుల ధాన్యం పాడు చేసే ఎలుకలు, కీటకాల సంఖ్య పెరుగుతుందన్నారు. నాగుపాము, జెర్రీ పోతు, రక్తపింజర, నీరుకట్టె, రెండు తలల పాములను ప్రదర్శిస్తూ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్, స్నేక్ సొసైటీ సభ్యులు రాకేష్, ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, అధికారులు గౌరిశంకర్, ప్రభాకర్, శ్రీనివాస్, యుగేందర్ పాల్గొన్నారు.

నకిలీ వైద్యుల క్లినిక్‌లు తనిఖీ


బెల్లంపల్లిలో తనిఖీ చేస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తమకు అందిన సమాచారం మేరకు శనివారం టీజీఎంసీ ఎథికల్, యాంటి క్వాకరీ బృందం సభ్యులు నకిలీ వైద్యుల క్లినిక్‌లను తనిఖీ చేసినట్లు కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్, కో ఆప్షన్ మెంబర్ డాక్టర్ సంతోశ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్‌లోని జనకపురి కీర్తి క్లినిక్, వివేకానంద చౌక్‌లోని శ్రీలక్ష్మీ సాయి క్లినిక్, మార్కెట్ రోడ్డులోని ధనలక్ష్మీ ఫార్మసి పక్కన, బెల్లంపల్లిలోని మనీష్ క్లినిక్‌లను తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. కొందరు వైద్యులుగా చలామణి అవుతూ అవసరం లేకున్నా మోతాదుకు మించి స్టెరాయిడ్, యాంటి బయోటిక్, నొప్పి మందులు, ఇతర హై షెడ్యూల్ మందులు ఇస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అలాంటి వారిపై ఎన్ఎంసీ చట్టాల ప్రకారం ఏడాది జైలు, రూ.5 లక్షల జరిమాన విధించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాలలోని మూడు ఆస్పత్రుల వైద్యులకు మెమోలు ఇవ్వడం జరిగిందని, మార్పురాకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

కుర్రెఘడ్‌లో అకాడి సంబరాలు షురూ


అడవితల్లికి పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని మారుమూల గ్రామమైన కుర్రెఘడ్‌లో శనివారం ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం అకాడి సంబరాలు జరుపుకున్నారు. తొలి పండుగను పురస్కరించుకుని అడవితల్లికి పూజలు నిర్వహించారు. పొలిమేరలో చెట్టుకింద ఉన్న రాజుల్‌పేన్ దేవుడికి ప్రత్యేక పూజలు చేసి కోడి పంచాంగం, పాడిపంటలు బాగుండాలని లక్ష్మణరేఖ లాంటి గీత గీసి తుర్రను ఊదుతూ పశువులను గీత దాటించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వల్క శ్రీను, కుర్సింగ భూదేశ్, పెందూర్ ప్రభాకర్, కుర్సింగ మాధవరావ్, వల్క రాము, లచ్చు, ఈస్రు, బదిరావ్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు పెల్లకూడా తీయనీయం

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థకు నష్టం కలిగేలా బొగ్గు గనుల వేలం వేసి ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే బొగ్గు పెల్ల కూడా తీయనీయమని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు అన్నారు. శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలన్నారు. కేంద్రం సింగరేణికి నష్టం చేసేలా శ్రావణ్‌పల్లి బొగ్గు గనిని వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులు సింగరేణి రక్షణ కోసం మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. అనంతరం జీఎం సంజీవరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: బెదిరింపులకు పాల్పడుతూ భూ కబ్జాకు యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సీసీసీ నస్పూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆచి వెంకటరమణ చారి మంచిర్యాలలోని గర్మిళ్ల శివారులో 2000 సంవత్సరంలో 39 గుంటల భూమిని తన భార్య పేరు మీద కొనుగోలు చేసి మ్యూటేషన్ చేయించుకున్నాడు. 39 గుంటల భూమిని ప్లాట్స్‌గా మార్చి 600 గజాల భూమిని తన ఆధీనంలో ఉంచుకుని మిగతా భూమిని విక్రయించాడు. అట్టి భూమిని స్థానిక తిలక్ నగర్‌కు చెందిన చిప్పకుర్తి జగన్, మల్లేష్, నారాయణ కాజేయాలని బెదిరింపులకు పాల్పడడంతో బాధితుని ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. అయినా వారు తమ పద్ధతి మార్చుకోకుండా బెదిరింపులకు పాల్పడతుండడంతో ప్రత్యేక పోలీసులు చిప్పకుర్తి జగన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మల్లేశ్, నారాయణ పరారీలో ఉన్నారని తెలిపారు.

నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు


మాట్లాడుతున్న డీఏవో సురేఖ

చెన్నూర్‌రూరల్: నియమ నిబంధనలు పాటించని ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్లపై చర్యలు తీసుకుంటామని డీఏవో సురేఖ అన్నారు. శనివారం కిష్టంపేట రైతు వేదికలో చెన్నూర్ డివిజన్‌లోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మాలని, తప్పని సరిగా బిల్లులు అందజేయాలని సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలోని వ్యవసాయశాఖ అధికారులకు రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఏడీఏ రాజేశం, ఏవోలు పాల్గొన్నారు.

బిల్లులు ఇప్పించండి సారూ..


బాధితుడు బాపు

చెన్నూర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని కిష్టంపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ వద్ద 50 రోజుల పాటు విద్యుత్ దీపాలు, కూలర్లు, మైక్ సెట్‌లు, వైరింగ్, జనరేటర్లు, ఫ్యాన్లు అమర్చినందుకు తనకు రావాల్సిన రూ.9 లక్షల బిల్లులు ఇప్పించాలని ఎలక్ట్రీషియన్ పాయిరాల బాపు కోరుతున్నాడు. శనివారం బిల్లుల పత్రాలను చూపిస్తూ తన ఆవేదన వెలిబుచ్చారు. ప్రతి రోజు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి స్పందించి వెంటనే బిల్లులు ఇప్పించాలని కోరుతున్నాడు.